క్లుప్తంగా

ఒక్క సీసీ కెమెరా వందమందితో సమానం



బుగ్గారంలో మాట్లాడుతున్న డీఎస్పీ

బుగ్గారం: ఒక్క సీసీకెమెరా వందమంది పోలీసులతో సమానమని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. మండలంలోని యశ్వంతరావ్‌పేటలో మజీద్ ఈ క్యూబా నందు శుక్రవారం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై శ్రీధర్‌రెడ్డి, మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులు పరిశీలన



బయో మైనింగ్ పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల: పట్టణ శివారులోని కల్లూర్ రోడ్డులో డంపింగ్ యార్డును, ఏసికోని గుట్ట వద్ద గల బయో మైనింగ్ ప్లాంటును మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బయో మైనింగ్ విధానం తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈఈ సురేష్, ఏఈ అరుణ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి పోరాటాలకు రజకులు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న పూసాల సంపత్

రాయికల్: సమష్టి పోరాటాలకు రజకులు సిద్ధం కావాలని రజక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. శుక్రవారం గ్రామస్థాయి చైతన్య సదస్సుల్లో భాగంగా మండలంలోని భూపతిపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం రజకుల సమస్యలను పరిష్కరించాలని, బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని విన్నవించినప్పటికీ రూ.2500 కోట్లు కేటాయించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. రజక కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించి నిధులు కేటాయించాలని, సబ్సిడీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు బండపల్లి మల్లీశ్వరి, బొడ్డుపల్లి జగన్, అలువాల హన్మండ్లు, కదుర్క గంగరాజం, విజయ్, రాములు, నారాయణ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఏవో యోగితా

కథలాపూర్: ఆయిల్‌పాం పంట సాగుపై మండలంలోని సిరికొండలో రైతులకు ఏవో యోగితా శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం మొక్కలను సబ్సిడీపై రూ. 1,140 కు 57 మొక్కలు అందిస్తారన్నారు. ఈ మొక్కలు ఎకరం భూమికి సరిపోతాయన్నారు. మొక్క నాటిన నుంచి 4 ఏళ్ల తర్వాత ఆదాయం వస్తుందన్నారు. అప్పటివరకు అంతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల రైతులు ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ ఏఈవోలను సంప్రదించాలని కోరారు.

మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

జగిత్యాలరూరల్/కోరుట్ల రూరల్/రాయికల్/ఇబ్రహీంపట్నం/మల్యాల: మహిళా రైతులకు ఎస్ఎంఏఎం పథకం కింద సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేయనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.మహిళా రైతులు దరఖాస్తుతోపాటు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టుసైజు ఫొటో జతచేసి, మండల వ్యవసాయ కార్యాలయాల్లో అప్పగించాలని ఏవోలు పేర్కొన్నారు. పరికరాలపై పూర్తి వివరాలకు ఏఈవోలు, ఏవోలను సంప్రదించాలని కోరారు.

రైతులకు అదనపు ఆదాయం పెంపే లక్ష్యంగా..

- మూగజీవాల పెంపకానికి ప్రోత్సాహం
- కోళ్లు, గొర్రెలు, గేదెలు, పందుల కోసం షెడ్ల నిర్మాణాలు
- ఉపాధి హామీ పథకంలో నిర్మాణం



పెంబట్లలో నిర్మాణంలో ఉన్న షెడ్



రంగపేటలో నిర్మాణంలో ఉన్న కోళ్ల షెడ్

సారంగాపూర్: ప్రభుత్వం రైతులు అదనపు ఆదాయం పొందేందుకు పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, గొర్రెలు, పందుల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. దీనికోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో షెడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటోంది.

అదనపు ఆదాయం కోసం..

రైతులు అదనపు ఆదాయం కోసం ప్రతి రైతు ఇంటిలో గేదెలు, లేదా పెరటి కోళ్లు, ఫాం కోళ్లు, గొర్రెలు, పందులను పెంచుకుంటున్నారు. పందుల పెంపకం ఈ ప్రాంతంలో లేకపోయినా ప్రభుత్వం పందుల పెంపకానికి కూడ షెడ్ల నిర్మాణాలు చేసుకోవడానికి రైతులకు సాయం చేస్తోంది. వ్యవసాయంలో పెరిగిన పెట్టుబడులతో అదనపు ఆదాయం కోసం వ్యవసాయానికి అనుబంధంగా ఉండే వాటి పెంపకంపై దృష్టిపెట్టారు.

షెడ్ల నిర్మాణాలకు నిబంధనలు..

రైతులు కుటుంబంలో ఒకరి పేరున ఈజీఎస్ జాబ్ కార్డు కలిగి ఉండాలి. ఐదెకరాల లోపు వ్యవసాయ భూమి కలిగి ఉండాలి. ఏ షెడ్డును నిర్మించుకుంటాడో వాటి పెంకం చేపట్టి ఉండాలి.

నిర్మాణంలో ఉన్నవి...

సారంగాపూర్ మండలంలో 2024–2025లో కోళ్ల షెడ్లు రంగపేట, పెంబట్లలో ఒక్కొక్కటి చొప్పున మంజూరు చేశారు.. గేదెల షెడ్లు అర్పపల్లి గ్రామంలో 6, రంగపేటలో 1, పెంబట్ల 6, సారంగాపూర్‌లో 3, బట్టపల్లిలో 3 షెడ్లను మంజూరు చేశారు. గొర్ల షెడ్లు లక్ష్మీదేవిపల్లి, అర్పపల్లి గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున మంజూరు చేశారు. అన్ని పనులు ప్రగతిలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

షెడ్ల నిర్మాణాలు ఇలా..

- ➡ కోళ్ల షెడ్డు నిర్మాణానికి ఈజీఎస్ ద్వారా రూ. 2.90 లక్షలు చెల్లిస్తుంది. షెడ్డు నిర్మాణం 15 మీటర్ల పొడవు, 4.50 మీటర్ల వెడల్పుకు తగ్గకుండా ఉండాలి, రైతు అవసరం అనుకుంటే మరింత పెంచుకునే వెసులుబాటు కల్పిస్తారు.
- ➡ గేదెలు (బర్లు) షెడ్డు నిర్మాణం 5 మీటర్ల పొడవు, 4 మీటర్ల వెడల్పు ఉండాలి, ఈ నిర్మాణానికి ఈజీఎస్ ద్వారా రూ. 85 వేలు రైతుకు చెల్లిస్తారు.
- ➡ గొర్ల షెడ్డు నిర్మాణం 6 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు కలిగి ఉండాలి, ఇందుకు ఈజీఎస్ ద్వారా రూ.95 వేలు చెల్లిస్తారు.
- ➡ మంజూరు కావాలను కునే రైతు పశువైద్యాధికారి ద్వారా ధృవీకరణ పత్రంతో పాటు, పంచాయతీ కార్యదర్శి ధృవీకరణ పత్రాన్ని ఈజీఎస్‌కు అందించాలి.

ప్రభుత్వ సాయంతో నిర్మాణం



నేను కోళ్ల ఫాం ఏర్పాటు చేసుకుంటున్నాను. షెడ్ లేక పోవడంతో కోళ్లను పెంచడం సమస్యగా ఉండేది. ప్రస్తుతం షెడ్ నిర్మాణానికి ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు చేయడంతో నిర్మాణం చేపట్టాను. పనులు పూర్తి కావచ్చాయి.

– జంగ లకుమయ్య, రంగపేట

రైతులకు మంజూరు చేస్తాం



ఎన్నికల కోడ్ ముగియగానే కొత్తగా నిర్మాణం చేసుకుంటామంటే రైతులకు మంజూరు చేస్తాం. ఈ మార్చి 31 లోపు నిర్మాణం పూర్తి చేస్తే ఏకకాలంలో బిల్లులు చెల్లించడం జరుగుతుంది.. అన్ని గ్రామాల్లో ప్రారంభించిన నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి.

– చౌడారపు గంగాధర్, ఎంపీడీవో

న్యాయం చేయాలని హిందీ పండిట్ అభ్యర్థుల వినతి



వినతిపత్రం ఇస్తున్న హిందీ పండిట్ మెరిట్ అభ్యర్థులు

మల్లాపూర్: డీఎస్సీ 2002 హిందీ పండిట్ మెరిట్ అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని బాధితులు ఖాజా మొహినొద్దీన్, సర్దార్ అయలోక్, సయ్యద్ ముజాహిద్, మాట్ల కుమార్ అన్నారు. శుక్రవారం వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. డీఎస్సీ 2002 హిందీ పండిట్ అభ్యర్థులమైన తమకు అప్పుడు ప్రకటించిన ఫలితాల్లో మెరిట్ జాబితాలో ఉన్నా అప్పటి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాన్ని కల్పించలేదన్నారు. ఈ విషయమై హైకోర్టు ఆశ్రయించగా, గతేడాది ఏప్రిల్‌లో మెరిట్‌జాబితా అభ్యర్థులకు 2 నెలల్లో ఉద్యోగ నియామకాలు ఇవ్వాలని తీర్పు ఇచ్చిందన్నారు. కానీ 11 నెలలు గడిచినా ఉద్యోగ అవకాశం కల్పించలేకపోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు. హైకోర్టు తీర్పు మేరకు సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విప్‌ను కోరారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల

మేడిపల్లి: ఉమ్మడి మండలంలోని నాలుగు గ్రామాలకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ రూ.58 లక్షల నిధులు మంజూరు చేశారు. వల్లంపల్లి గ్రామానికి రూ.18 లక్షలు, మన్నెగూడెంకు రూ.20 లక్షలు, మేడిపల్లికి రూ.15 లక్షలు, పోరుమల్లకు రూ.5 లక్షలు నిధులు మంజూరు చేసారు. గ్రామాల్లో సమస్య ఉందని ఎమ్మెల్యేకు చెప్పిన 12 గంటల్లోనే నిధులు మంజూరు చేయడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

యువత దేశాభివృద్ధికి పాటుపడాలి



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

జగిత్యాల: నేటి యువత దేశాభివృద్ధికి పాటుపడాలని, అంకిత భావంతో నిరంతరం సమాజాన్ని అధ్యయనం చేస్తుండాలని ప్రముఖ అడ్వకేట్ కాసుగంటి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్‌కేఎన్ఆర్ కళాశాలలో వికసిత్ యూత్ పార్లమెంట్ రాష్ట్ర స్థాయి ఎంపిక ముగింపు పోటీలు జరుగగా, ఎస్‌కేఎన్ఆర్ కళాశాల స్థల దాత కాసుగంటి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణల పట్ల తమ విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అభివృద్ధి పర్చుకుని బలహీనవర్గాల ప్రజలకు చేయూతనందిస్తూ ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ అశోక్ మాట్లాడుతూ, జగిత్యాల జిల్లా నోడల్ జిల్లాగా ఎంపికవడం అభినందనీయమని, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చి ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, రాజు, గోవర్ధన్, మధుకర్, సురేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులకు నిరాశే మిగిలింది



మాట్లాడుతున్న పేట భాస్కర్

జగిత్యాలటౌన్: ఎస్సీ కార్పొరేషన్ నిధుల మంజూరు కోసం నాలుగేళ్లు నిరీక్షించిన అర్హులకు నిరాశే మిగిలిందని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘ కార్యాలయంలో టీఏవైఎస్ జిల్లా అధ్యక్షుడు కొంగర పవన్, టీపీఎస్‌జేఏసీ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మల్లారెడ్డితో కలిసి మాట్లాడారు. 2020–21గాను దళిత యువతలో వృత్తి నైపుణ్యాలను గుర్తించి, ఇంటర్వ్యూలు నిర్వహించిన అప్పటి ప్రభుత్వం సబ్సిడీ చెక్కులను బ్యాంకులలో జమ చేశారు తప్ప నిధులు విడుదల చేయకపోవడంతో నిరాశే మిగిలిందన్నారు. రుణాలు మంజూరవుతాయని గంపెడాశతో అప్పు చేసి బ్యాంకుల్లో మార్జిన్‌మనీ డిపాజిట్లు చేసిన పలువురు ఇప్పటికీ వడ్డీలు కడుతున్నారని వాపోయారు. జిల్లాలో ఇలాంటివారు 150మందికి పైగా ఉన్నారని తెలిపారు. నాలుగేళ్లు నిరీక్షించి విసిగిపోయిన యువతకు రాజీవ్ యువవికాసంలోనైనా మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించి దళిత యువతను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉరుములతో కూడిన వర్షం



మల్యాలలో రోడ్డుపై వర్షం నీరు

మేడిపల్లి/మల్యాల: ఉమ్మడి మేడిపల్లి మండలవ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం చాలా గ్రామాల్లో సుమారు 15 నిమిషాలు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షంతో రైతులు ఆందోళన చెందినా ప్రజలు ఉక్కపోత నుంచి కాస్త ఉపసమనం పొందారు. మల్యాల మండలంలో మెరుపులతో కూడిన వర్షం కురిసి రోడ్డు వెంట గుంతల్లో నీరు నిలిచింది.

ఈబీసీ యువతకు అవకాశం కల్పించాలి

- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాలటౌన్: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించేందుకు ప్రవేశ పెట్టిన రాజీవ్ యువవికాసం పథకంలో ఆర్థికంగా వెనుకబడిన యువత(ఈబీసీ)కు అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈ విషయమై శుక్రవారం ఆయన శాసనమండలిలో మాట్లాడారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం రూ.5లక్షల రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించడాన్ని అభినందించిన జీవన్ రెడ్డి ఈ పథకాన్ని ఈబీసీ యువతకు వర్తింపచేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

జగిత్యాల: చలివేంద్రం ప్రజలకు ఉపశమనం లభిస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మడలేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోగికార్ మహేందర్, శ్రీనివాస్, పంబాల రాము, రవీందర్, సుధాకర్ పాల్గొన్నారు.


ఇటిక్యాలలో..

రాయికల్: మండలంకలోని ఇటిక్యాలలో మామిడి వినీత్ జ్ఞాపకార్థం 2013–14 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆధ్వర్యంలో శుక్రవారం హైస్కూల్, బస్టాండ్ ఏరియాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను వినీత్ తల్లిదండ్రుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

వంద శాతం రుణ వసూళ్లకు సహకరించాలి

సారంగాపూర్: పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతుల నుంచి వందశాతం రుణాల వసూలు చేయడానికి రైతులు, సంఘ సభ్యులు సహకరించాలని సారంగాపూర్ సింగిల్ విండో సీఈవో లైశెట్టి శివ అన్నారు. శుక్రవారం సొసైటీ సర్వసభ్య సమావేశం సంఘం అధ్యక్షుడు ఏలేటి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటి వరకు దీర్ఘకాలిక (లాంగ్ టర్మ్‌లోన్స్) 85 శాతం వసూళ్లు జరిగాయని, పంట రుణాలు 90 శాతం వరకు జరిగినట్లు తెలిపారు. ఈ నెల 30 లోపు వందశాతం వసూలు చేయడానికి సహకరించాలని కోరారు. రబీ ధాన్యం సేకరణ సాఫీగా జరగడానికి తీసుకోవాలసిన చర్యలపై చర్చించారు. సమావేశంలో డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడితే సహించేది లేదు



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మల్లాపూర్: బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి జువ్వాడి బ్రదర్స్‌పై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్‌లో మాట్లాడారు. రైతుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని కొనియాడారు. నియోజకవర్గానికి కోట్లాది నిధులను తెచ్చి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్న జువ్వాడి బ్రదర్స్‌ను, కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. సమావేశంలో ప్యాక్స్ డైరెక్టర్ పూండ్ర లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ సేవాదల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మల్యాల: మల్యాల అడ్డరోడ్డులో జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారి పక్కన ఆర్టీసీ బస్‌స్టాప్ నిరుపయోగంగా మారింది. గతంలో బైక్‌లు పార్కింగ్ చేయడంతో మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ బస్టాపులో మట్టిపోయించి, చదును చేయడంతోపాటు బైక్‌లు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకున్నారు. బస్సులు బస్టాపు ఎదుట నిలుపకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్టీసీ అధికారులు మాత్రం బస్టాప్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జగిత్యాల డిపో మేనేజర్., సెల్‌ఫోన్ నంబర్: 9959225925

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

రుణమాఫీ, రైతు భరోసా జమ చేయాలని రాస్తారోకో



బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించారని నిరసిస్తూ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా నిధులు వెంటనే ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రుణమాఫీతో పాటు, రైతుభరోసా నిధులు జమచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈనెల 24న అసెంబ్లీ ముట్టడికి గ్రామంలో రైతులంతా కలిసి తరలివెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు కొప్పెర వెంకట్‌రెడ్డి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు

ధర్మపురి: ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. తక్కువ వేతనాలతో ఎక్కువ పని భారం మోస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం గుర్తించాలని, ప్రభుత్వం అందిస్తున్న వేతనం ఏ మూలకు సరిపోవడం లేదని ఆశలకు జీతాలు పెంచి ప్రతి నెల రూ.10వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యురాలికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యశోద, సత్యగంగ, శారద,విజయలక్ష్మిచ సరిత తదితరులున్నారు.

వంచిత్ బహుజన్ అఘాడీ కార్యవర్గం నియామకం

సారంగాపూర్: వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ) పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన మీసాల లింగయ్య, మండల అధ్యక్షుడిగా బాదినేని మల్లేశ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు, నూతనంగా నియమితులైన కార్యవర్గానికి ఆయన పార్టీ కండువాలు కప్పారు. సమావేశంలో నాయకులు అనంతుల స్వామి, ఎండీ. సులమాన్, సలీం, మీసాల లింగయ్య, గుడ్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

కోరుట్ల రూరల్: జగిత్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ శుక్రవారం నియమించారు. ఈ మేరకు నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆరెల్లి రాజ్‌కుమార్, కోరుట్ల పట్టణ అధ్యక్షుడిగా పేరాల శరత్, మండల అధ్యక్షుడిగా తక్కూరి భాస్కర్, పట్టణ ఉపాధ్యక్షుడిగా నీలి ప్రవీణ్ కుమార్, మండల ఉపాధ్యక్షుడిగా గజెల్లి మధులతో పాటు కార్యవర్గ సభ్యులను నియమించారు.

టీఆర్‌టీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా రమేశ్

ధర్మపురి: టీఆర్‌టీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా మెరుగు రమేశ్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గజ భీంకార్ గోవర్ధన్ తెలిపారు. ధర్మపురి పట్టణంలో శుక్రవారం మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలున్నాయని, వాటిని సత్వరమే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు విజయానంద, దాసరి భీమన్న, మండల అధ్యక్షుడు బండారి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి రైతులు తరలిరావాలి

కథలాపూర్: ఈనెల 24న చలో అసెంబ్లీ ముట్టడికి రైతులు తరలిరావాలని జిల్లా రైతు ఐక్యవేదిక నాయకులు బద్దం మహేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. రైతులందరికి రైతు భరోసా, పంట రుణం మాఫీ పూర్తయ్యేవరకు రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

యాదవులకు అండగా ఉంటాం

మెట్‌పల్లిరూరల్: యాదవులకు ఏ ఆపద వచ్చినా అఖిల భారత యాదవ మహాసభ అండగా ఉంటుందని జిల్లా యూత్ అధ్యక్షుడు రెబ్బాటి రాజేందర్ అన్నారు. మెట్‌పల్లి మండలం వేంపేటకు చెందిన అంజయ్య యాదవ్ గొర్రెలు ఇటీవల కుక్కల దాడిలో మృతి చెందగా, ఆయనను శుక్రవారం కలిసి అధికారులతో మాట్లాడి నష్టపరిహారం వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్, మహేశ్,మధు, శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనే లక్ష్యం

కథలాపూర్: యాదవులను చైతన్యపరిచి వారి హక్కులను సాధించుకోవడమే లక్ష్యమని జిల్లా యాదవసంఘం అడహక్ కమిటీ అధ్యక్షుడు గానవేని మల్లేశ్‌యాదవ్ అన్నారు. మండలంలోని తక్కళ్లపెల్లిలో 82 మంది జిల్లా సభ్యత్వం తీసుకున్నారు. నాయకులు కల్లూరి దేవయ్య, బర్ల మధు, సాగర్, గంగాధర్, మహేశ్, మహేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక

జగిత్యాలరూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బి.జవహర్‌లాల్ నాయక్ తెలిపారు. ఏదైనా విద్యుత్ సమస్య ఉన్న వారు పట్టణ సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించే పరిష్కార వేదికకు హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి పనులు పరిశీలన

మల్లాపూర్: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మంజూరు చేయించిన నిధులతో మల్లాపూర్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామిగౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి సీసీరోడ్ల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించినందుకే ప్రజలు వరుసగా 5 సార్లు బీఆర్ఎస్‌ను గెలిపించారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బిక్షపతి, భూమయ్య, లక్ష్మణ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.